# వర్షబీభత్సం..
# దారులు ధ్వంసం



**కరీంనగర్ –నవభూమి:** వర్షాలతో జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ ప్రధాన రహదారులకు గండ్లు పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన వారు దారి మళ్లించుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా మొత్తం ఏడు వంతెనలు, 12 రహదారులు వరదలకు కోతలు పడి దెబ్బతిన్నాయి. 19 రహదారులను తక్షణంగా మరమ్మతు చేసేందుకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దెబ్బతిన్న రోడ్లపై ప్రయాణం చేయడానికి వీలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల మీదుగా ప్రజలు వెళ్తున్నారు.జమ్మికుంట నుంచి పచ్చునూర్ వెళ్లే ప్రధాన రహదారులలో పలు చోట్ల గండ్లు పడ్డాయి. వంతెన చోట రహదారిని మళ్లించేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారి నర్సింగపూర్ వద్ద దెబ్బతినగా అక్కడ మరమ్మతులు పూర్తి చేశారు.మామిడాలపల్లి వద్ద మాత్రం వర్షపు నీరు వెళు ్తండటంతో మరమ్మతు పనులు చేసేందుకు అధికారులు వేచి చూస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గం నుంచి వాహనాలు వెళ్తున్నాయి.కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఫకీర్‌పేట నగునూర్, ఇరుకుల్ల ఎలబోతారం వంతెనల వద్ద స్లాబ్‌లు దెబ్బతిన్నాయి.మానకొండూర్, జమ్మికుంట మండలాలను కలిపే పచ్చునూర్ రహదారి వెళ్లే ప్రాంతాలలో మామిడాలపల్లి, లింగాపూర్, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో స్వల్పంగా ధ్వంసమయ్యాయి.చిగురుమామిడి మండలం రేకొండ వెళ్లే దారి మధ్యలో భారీ వర్షాలకు గండ్లు పడ్డాయి.చొప్పదండి, గంగాధర, రామడుగు, తిమ్మాపూర్, జమ్మికుంట, కరీంనగర్ గ్రామీణ మండలాల పరిధిలోని పలు గ్రామాల రహదారులు దెబ్బతిన్నాయి. రాయపట్నం–కోదాడ, జమ్మికుంట–పచ్చునూర్, వెదిర ఎక్స్ రోడ్డు–గుండి, తీగలగుట్టపల్లి–నగునూర్, ముగ్దుంపూర్–నగునూర్, మానకొండూర్–ఊటూర్ రహదారులు, ఇందిరానగర్, మన్నెంపల్లి, మానకొండూర్ మీదుగా పచ్చునూర్ వెల్ది వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో అధికారులు మరమ్మతులు చేపట్టే ప్రక్రియలో నిమగ్నమయ్యారు.మరమ్మతులు పూర్తి చేస్తాం జిల్లావ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు, వంతెనల నివేదికలు ప్రభుత్వానికి పంపించాం. తాత్కాలికంగా మరమ్మతులు జరుగుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

# కర్రలు పట్టుకొని విధులకు







నవభూమి
కరీంనగర్
అనుబంధం
07 సెప్టెంబర్,2024 శనివారం పేజీలు:3
www.epaper.navabhoomi.in

## అధ్వాన రోడ్డు.. వాహనదారుల
# తిప్పలు

**మంథని:–నవభూమి:** మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీకి వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా మారింది.వాహనదారులు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. పూర్వం ఈ మార్గంలో పంట పొలాలకు వెళ్లేందుకు మట్టిదారి ఉండేది. పది సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ బిట్టుపల్లి శివారులో అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి రచ్చపల్లి, అక్కెపల్లి, లద్నాపూర్ భూ నిర్వాసితుల కోసం పునరావాస కాలనీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూ.రెండు కోట్ల వ్యయంతో ఒకవరుస తారురోడ్డు నిర్మించారు. ఈ మార్గంగుండా మంథని మండలంలోని బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్నఓదాల, ముత్తారం మండలంలోని సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సంవత్సరం క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన నిర్మించి ప్రారంభించడంతో ఈ రహదారిపై రోజుకు వందల సంఖ్యలో వాహనాలు వెళు తున్నాయి. ఈ రహదారిపై జనగలంత వాగు నీటితో పాటు బిట్టుపల్లి పెద్దచెరువు నీరు ప్రవహించడంతో వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు కిలోమీటర్ల పాటు ఈ రోడ్డులో అనేక మలుపులు ఉండటంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ఉన్న కాజ్‌వే వద్ద వంతెన నిర్మాణంతోపాటు రహదారిని రెండు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. సింగరేణి సంస్థ భూనిర్వాసితుల కోసం నిర్మించిన రహదారిని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు అప్పగించక పోవడంతో ప్రభుత్వ పరంగా రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు కావడంలేదు. పునరావాస కాలనీ కోసం ఏర్పాటు చేసిన రహదారికి సింగరేణి సంస్థ మరమ్మతులు చేపట్టాలని రచ్చపల్లి వాసులు కోరుతున్నారు.మరమ్మతులు చేపట్టాలి సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకు ఉన్న రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ రహదారి 10 గ్రామాలతోపాటు భూపాలపల్లి జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వానా కాలంలో రోడ్డుపై నీరు పారడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పునరావాస కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాజ్‌వే వద్ద సింగరేణి సంస్థ వంతెన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.నాగరాజు రచ్చపల్లి రోడ్డు ప్రమాదాలను నివారించాలి సూరయ్యపల్లి – రచ్చపల్లి రహదారి ఇరుగ్గా ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నివారించాలి. రహదారి గుంతల మయంగా మారి అందులో వరదనీరు నిలుస్తోంది. మలుపు అధికంగా ఉండటంతో వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. పునరావాస కాలనీలో సదుపాయాల కల్పనకు సింగరేణి సంస్థ చర్యలు చేపట్టాలి.



# జాతీయ సాధన సర్వే పరీక్షకు కార్యాచరణ



**కరీంనగర్ -నవభూమి:** పాఠశాల విద్యార్థులు చదువుల్లో కనబరుస్తున్న సామర్థ్యాలను పరీక్షించేందుకు కేంద్రం ఏటా జాతీయ సాధన సర్వే(నాస్)ను నిర్వహిస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో కూడా పలు తరగతుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు దీన్ని నిర్వహించేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 3, 6, 9వ తరగతులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల చదువుల పరిస్థితిని తెలుసుకోనున్నారు. నాస్ సర్వేను దేశ వ్యాప్తంగా నవంబరు 19న ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే మండల, జిల్లా స్థాయిల్లో జిల్లా విద్యాశాఖల అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు కొన్ని రోజులుగా ఆయా తరగతుల విద్యార్థులకు బోధిస్తూ సిద్ధం చేస్తున్నారు. బాలల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఆ విద్యార్థులకు ముందస్తుగా నిర్వహించే పరీక్షల కోసం ప్రశ్నపత్రాల తయారీకి రాష్ట్ర విద్యాశాఖ నిధులను మంజూరు చేసింది. నాస్ పరీక్షల్లో గతంలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు చదవడం, రాయడం, గణితంలో నిరాశజనక ఫలితాలు సాధించినట్లు తేలింది. ఈసారి ఇంత కంటే మెరుగైన రీతిలో విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు చాటుకునేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి నిలిపి సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను ముందస్తుగా అంచనా వేసి వారి ప్రగతిని పెంచేందుకు మూడు సామర్థ్య పరీక్షలను రాష్ట్ర విద్యాశాఖ నిర్వహిస్తోంది. ప్రశ్నపత్రాల తయారీకి అవసరమయ్యే నిధుల్లో సగం నిధులను విడుదల చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయిలో మొదటి సామర్థ్య పరీక్షను ఈనెల 19న, రెండోది 30న, మూడోది అక్టోబరు 8న నిర్వహిస్తున్నారు. మంజూరైన నిధులతో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలను ముద్రించి పాఠశాలలకు పంపిణీ చేయనున్నారు. మూడు ప్రశ్నపత్రాల ముద్రణకు సగం నిధులు రూ.2,33,792ను విడుదల చేశారు.

# ప్రతిభ చూపండి.. రూ.లక్షలు గెలవండి

**కరీంనగర్-నవభూమి:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) 90వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థులు ఈనెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. పోటీలు ఈనెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జరగనున్నాయి. ఇటీవల కరీంనగర్ ఎస్సారార్ కళాశాల విద్యార్థులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. దరఖాస్తు విధానం..1 సెప్టెంబరు 2024 నాటికి 25 ఏళ్లలోపు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్న వారు అర్హులు. %ఃఒ.తీఎఱ90నబఱఓ.ఱఅ% వెబ్‌సైట్‌లో ఈనెల 17 వరకు నమోదు చేసుకోవాలి. మొదట వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంపిక చేసుకొని క్లిక్ చేయగా రిజిస్ట్రేషన్ పేజీ తెరుచుకుంటుంది. రాష్ట్ర, జిల్లా, కళాశాల పేరు నమోదు చేయాలి. పోటీలో పాల్గొనే విద్యార్థులు ఇద్దరి పేర్లు నమోదు చేయాలి. విద్యార్థి ఐడీ, ఈమెయిల్, ఫోన్ నం. జెండర్, పుట్టిన తేదీ వంటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి పరీక్ష రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. సబ్మిట్ కొడితే సరిపోతుంది. మీ పేరు నమోదవుతుంది. విద్యార్థుల్లో బ్యాంకు, ఆర్థిక వ్యవస్థపై బాధ్యతాయుతంగా ఉండటం, డిజిటల్ లావాదేవీలు, సురక్షితం వంటి అంశాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఉత్సాహంగా ముందుకు ఆర్‌బీఐ 90 ఏళ్ల గుర్తుగా నిర్వహించే క్విజ్ పోటీలకు మంగళవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాం. విద్యార్థులు పోటీలో పాల్గొనటానికి ఉత్సాహంగా ముందుకొస్తున్నారు. ఒకే విద్యార్థి జిల్లా, రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయి పోటీలో నెగ్గితే రూ.14 లక్షలు గెలుచుకోవచ్చు. డాక్టర్ వై.సత్యనారాయణ, ప్రిన్సిపల్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల, కరీంనగర్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రతి కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా పేర్లు నమోదు చేసుకోవచ్చు. బృందానికి ఇద్దరు ఉండాలి. పోటీలు నాలుగు దశల్లో నిర్వహిస్తారు. మొదట జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌తో ప్రారంభమై రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు ఉంటాయి. విజేతలు రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు గెలుపొందే అవకాశం ఉంటుంది. పోటీలు హిందీ, ఆంగ్ల భాషల్లో ఉంటాయి. ప్రధానంగా దేశ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ, డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, అంశాలపై ప్రశ్నలు ఉండనున్నాయి.

# యోగా శిక్షణ ప్రారంభమెప్పుడో?



**ఇబ్రహీంపట్నం-నవభూమి:** ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో చాలా మంది శారీరక శ్రమకు దూరమవుతున్నారు. పని ప్రభావంతో మానసిక ఒత్తిడి, తీవ్ర ఆందోళనకు గురికావడంతో దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు రుగ్మతల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో గర్భిణులు, రోగులతో పాటు వృద్ధులకు యోగా శిక్షణ ఇవ్వడానికి జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు అనుబంధంగా ఆరోగ్య స్వస్థత(యోగా శిక్షణ) కేంద్రాలను రెండేళ్ల కిందట ఏర్పాటు చేసింది. నిర్మాణాలు పూర్తయినప్పటికీ శిక్షకుల నియామకంలో జాప్యంతో శిక్షణ కేంద్రాలు నిరుపయోగంగానే ఉన్నాయి. శిక్షకుల ఎంపికలో జాప్యం ఒక్కో యోగా కేంద్రంలో ఇద్దరు శిక్షకులను నియమించనున్నారు. మహిళలకు యోగా శిక్షణ ఇచ్చేందుకు మహిళా శిక్షకురాలు, మగ వారికి మగ శిక్షకుడు ఉండాలి. ఆడ, మగ వారికి ఒకే సమయంలో కాకుండా వేర్వేరు సమయాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. కాగా శిక్షకుల ఎంపికే అసలు సమస్యగా మారింది. స్థానికంగా ఉండి యోగా శిక్షణలో ధ్రువీకరణ పత్రం ఉన్నవారినే శిక్షకులుగా ఎంపిక చేయాల్సిన నిబంధన ఉంది. స్థానికంగా ధ్రువీకరణ పత్రం ఉన్న వారు ఎవరూ లేకపోవడంతో శిక్షకుల ఎంపికలో జాప్యం చోటు చేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా శిక్షకులను ఎంపిక చేయక పోవడంతో యోగా కేంద్రాలు వృథాగా ఉంటున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఏ విధంగా నడిపిస్తున్నారో అధ్యయనం చేసి, మన రాష్ట్రంలో కూడా అలాగే అమలు చేయాలని భావిస్తున్నట్లు ఆయుష్ విభాగం అధికారులు తెలిపారు. శిక్షకులను త్వరగా నియమించి, యోగా కేంద్రాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు, వృద్ధులు, గర్భిణులకు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి మేలు జరగనుంది. జిల్లాలో 12 కేంద్రాలు జిల్లాలో మొదటి విడతలో 12 యోగా శిక్షణ కేంద్రాలను రెండేళ్ల కిందట ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున కేటాయించారు. జిల్లాలో ధర్మపురి, లక్ష్మీపూర్, బండలింగాపూర్, వివిరావుపేట్, వెల్గుల్ల, బతికేనపల్లి, ఎండపల్లి, కొడిమ్యాల, మేడిపల్లి, ఐలాపూర్, చిల్వాకోడూర్, అల్లిపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ఆవరణలో వీటిని నిర్మించారు. బండలింగాపూర్, వెల్గుల్ల, ఎండపల్లి, కోరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం, ఇతర కారణాలతో వాటికి మంజూరైన యోగా కేంద్రాలను వేరే చోట నిర్మించారు. బండలింగాపూర్‌కు మంజూరైన యోగా కేంద్రం ఇబ్రహీంపట్నంలో, వెల్గుల్ల యోగా కేంద్రం జగ్గాసాగర్‌లో, ఎండపల్లి యోగా కేంద్రం అంబారిపేట్‌లో, కోరుట్ల యోగా కేంద్రం అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో నిర్మించారు.

# సిరులు కురిపించని కురులు

**సిరిసిల్ల -నవభూమి:** తలనీలాల సేకరణ నిలిపేసిన గుత్తేదారు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు వేములవాడలోని రాజన్నకు కోడె మొక్కులు, ప్రసాదాలు, ప్రత్యేక పూజలే కాదు. కురులు కూడా సిరులు కురిపించేవి. వీటికి అంతర్జాతీయ మార్కెట్‌లో మొన్నటి వరకు మంచి డిమాండ్ ఉండేది. ఇటీవల ధరలు పడిపోయాయి. దీంతో వీటి సేకరణ హక్కులు పొందిన గుత్తేదారు భక్తులు సమర్పించే తలనీలాల సేకరణను నిలిపివేశారు. ఫలితంగా కల్యాణకట్టలో కేశాల నిల్వలు భారీగా పేరుకుపోయాయి. శ్రావణమాసం సందర్భంగా భక్తులు సమర్పించిన కేశాలు ఇటీవల కురిసిన వర్షాలతో తడిసి కల్యాణకట్టలో దుర్గంధం వ్యాపిస్తోంది. సిరులు కురిపించే కురుల సేకరణ నిలిచిపోవడంతో వాటిని భద్రపరిచేందుకు అధికారులకు అవస్థలు తప్పడం లేదు. రాజన్న భక్తులు సమర్పించే కేశాలు దేశాలు దాటి వెళ్తున్నాయి. వీటిని ప్రధానంగా విగ్గుల తయారీతోపాటు కనురెప్పలు, మీసాలు, గెడ్డాలు వంటి అలంకరణ ఉత్పత్తుల తయారీకి వినియోగిస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు సమర్పించే తలనీలాలను పలు దశల్లో శుభ్రపరిచి వాటిలో సైజుల వారీగా వేరు చేస్తారు. వీటికి నాణ్యతను బట్టి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. మార్కెట్‌ను బట్టి టన్నుకు రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు ధర పలుకుతుంది. శ్రావణమాసం, ప్రత్యేక పర్వదినాలు, శివరాత్రి తదితర సమయాల్లో నెలకు సగటున వెయ్యి కిలోల వరకు కేశాలు వస్తాయి. వీటిలో మహిళలు సమర్పించే తలనీలాలు పొడవైనవి. నాణ్యమైన వాటికి కిలో రూ.400 పైనే ధర పలుకుతుంది. పురుషులు, చిన్న పిల్లలకు సంబంధించినవి చిన్నగా ఉండే వాటికి ధర తక్కువ ఉంటుంది. రంగును బట్టి కూడా ధర ఆధారపడి ఉంటుంది. గుత్తేదారు సేకరించిన కేశాలను వివిధ దశలో శుభ్రపరుస్తారు. పొడవైన నల్లని కురులను సినిమా రంగంలో విగ్గుల తయారీ కంపెనీలకు, విదేశాలకు ఎగుమతి చేసి మంచి ధర పొందుతారు. కాగా కొంత కాలంగా అంతర్జాతీయ మార్కెట్‌లో కేశాలకు ధర లేక ఇక్కడి నుంచి సేకరణ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. రెండేళ్ల కోసారి టెండర్లు ఆలయంలో తలనీలాల టెండర్లు రెండేళ్లకోసారి నిర్వహిస్తుంటారు. 2023లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి గుత్తేదారులు పోటీ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా హిందూపూర్‌కు చెందిన సుమిత్ అనే సంస్థ రూ.19 కోట్లకు సేకరణ హక్కులు పొందింది. ఒప్పందం దశలో రూ.50 లక్షలు చెల్లించింది. వీటితోపాటు ముందస్తు చెల్లింపులకుగాను రూ.79 లక్షలకు రెండు చెక్కులు ఇచ్చింది. వాటిని ఆలయ అధికారులు ఇటీవల బ్యాంకులో జమ చేయగా చెల్లుబాటు కాలేదు. మొదటి ఏడాది చెల్లించాల్సిన దానిలో బకాయి ఉండటం, రెండో ఏడాది డబ్బులు చెల్లించకపోవడంతో ఆలయ అధికారులు తలనీలాల తరలింపును నిలిపివేశారు. స్పందించకపోతే చర్యలు కురుల సేకరణకు ముందుకురాని గుత్తేదారు సంస్థపై రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం.



## ప్రపంచాన్ని వారికీ చూపిద్దాం!

**గోదావరిఖని -నవభూమి:** ఒక్క క్షణం కళ్లు మూసుకుంటేనే అంధకారాన్ని భరించలేం. అలాంటిది జీవితాంతం చూపులేని వారి ఇబ్బందులు వర్ణనాతీతం.రంగుల ప్రపంచాన్ని చూడాలనే ఆశతో ఎదురుచూస్తున్న అంధులు ఎందరో. మానవ శరీర నిర్మాణంలో నేత్రాలకున్న ప్రాధాన్యత అలాంటిది. అందుకే సర్వేంద్రియాం.. నయనం ప్రధానం అంటారు. మనం మరణించినా.. మన కళ్లు నేత్రదానంతో మరొకరి శరీరం ద్వారా ప్రపంచాన్ని చూసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'నేను ఇప్పుడు స్పష్టంగా చూడగలుగుతున్నాను' అనే నినాదంతో ముందుకెళుతుంది.పెరుగుతున్న అవగాహన నేత్రదానంపై గత పాతికేళ్లుగా వివిధ స్వచ్ఛంధ సంస్థలు విస్తృతంగా ప్రచారం చేయడంతో విశేష స్పందన లభిస్తుంది. రామగుండం ప్రాంతానికి చెందిన లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంధ సంస్థలు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడం సత్ఫలితాలనిస్తుంది. సదాశయ ఫౌండేషన్ ఇప్పటివరకు 1200మంది అంధుల జీవితాల్లో వెలుగులు నింపగా.. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల, అబ్బిడిపల్లి గ్రామాల వాసులు ఏకగ్రీవంగా తీర్మానం చేయడంపై పెరుగుతున్న అవగాహనకు నిదర్శనం. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత పాతికేళ్లలో సుమారు 6500 మంది నేత్రదానాలు చేశారు.ఇవి గుర్తుంచుకోండి..నేత్రదానానికి వయసుతో సంబంధం లేదు.కాటరాక్టు శస్త్రచికిత్సలు చేయించుకున్నా.. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులైనా దానం చేయవచ్చు.వ్యక్తి చనిపోయిన 6 గంటల్లోగా నేత్రాలను సేకరించాల్సి ఉంటుంది.సేకరించిన వాటిని 14 రోజుల్లో అంధులకు అమర్చాల్సి ఉంటుంది. దేశంలో దాదాపు 25లక్షల మంది చూపుకోసం ఎదురుచూస్తున్నారు.మరణించాక తన నేత్రాలను దానం చేయాలంటూ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతోపాటు.. నేత్రదానానికి కృషి చేస్తున్న స్వచ్ఛంధ సంస్థలకు సమాచారం ఇవ్వాలి. దీంతో మరణానంతరం మీ ఆశయసాధన కోసం వారు నేత్రదానానికి ఉపక్రమిస్తారు.పాతికేళ్లుగా...పాతికేళ్ల క్రితం మా నానమ్మ కోల వెంకటమ్మ నేత్రాలను దానం చేయడంతో మొదలై.. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ట్రస్టు ఆధ్వర్యంలో ఎంతోమంది అంధుల జీవితాల్లో వెలుగులు నింపాం. శ్రీలంక లాంటి దేశాల్లో మాదిరిగా నేత్ర, అవయవదానాన్ని తప్పనిసరిచేస్తూ చట్టాన్ని తేవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.కోల అన్నారెడ్డి, లయన్స్ క్లబ్ నేత్ర వైద్యశాల ట్రస్టు సభ్యులు చట్టం తీసుకురావాలి..ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించినట్లుగా అవయవదాతల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించడంతోపాటు రూ.10వేలు అందించనున్నట్లుగా తెలంగాణలోనూ నిర్ణయం తీసుకోవాలి. ప్రముఖులు నేత్ర, అవయవదానంలో ఆదర్శంగా నిలవాలి. ఫ్రాన్స్, స్పెయిన్, శ్రీలంక మాదిరిగా మన దేశంలోనూ అవయవదానాన్ని తప్పనిసరిచేస్తూ చట్టం తేవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు నేత్ర, అవయవదానంపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలి.

## అవినీతిలో పోటాపోటీ

**జగిత్యాల,-నవభూమి:** అయిదు, ఆరంకెల జీతమున్నా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు బల్ల కింద చేయి చాచి లంచాలకు ఆశ పడుతున్నారు.ఉద్యోగరీత్యా చేయాల్సిన పనికి లంచం ఆశిస్తూ చివరకు అనిశా వలలో చిక్కుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నాలుగేళ్లుగా ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన ప్రభుత్వ అధికారుల్లో రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. వీరితో పాటు 13 శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అవినీతి మరకలు అంటించుకున్నారు. క్షేత్రస్థాయిలో అవినీతి జాడ్యం విపరీతంగా పెరిగిపోయి చాలా 'చేపలు' వలకు చిక్కకుండా తమ పని కానిచ్చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే 8 కేసులు నమోదు కాగా 15 మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.ముందు వరుసలో రెవెన్యూ, పోలీస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నమోదైన కేసులను పరిశీలిస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది అవినీతిలో మొదటి, రెండో స్థానాల్లో నిలిచారు. 2021 నుంచి 2024 ఆగస్టు వరకు రెవెన్యూ శాఖలో 8 కేసులు నమోదు కాగా 16 మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. పోలీసు శాఖలో ఈ నాలుగేళ్లలో 7 కేసులు నమోదు కాగా 10 మందిని అరెస్టు చేశారు. 6 కేసులు, ఏడుగురి అరెస్టుతో పంచాయతీరాజ్ శాఖ మూడో స్థానంలో నిలిచింది. పురపాలక శాఖ 4, రిజిస్ట్రేషన్ శాఖ 2, విద్యుత్తు, తూనికలు-కొలతలు, సర్వే, వైద్య-ఆరోగ్య, మార్కెటింగ్, మత్స్య, టౌన్ ప్లానింగ్, పరిశ్రమల శాఖల్లో ఒక్కో కేసు చొప్పున నమోదైంది. నాలుగేళ్లలో అన్ని శాఖల్లో కలిపి 35 కేసుల్లో 56 మందిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు.అవినీతి ఆరోపణల్లో అరెస్టయిన వారికి న్యాయస్థానాలు జైలు శిక్ష, జరిమానాలు విధిస్తుండటంతో లంచగొండి అధికారులు భయపడుతున్నారు. 2022లో వీఆర్వో జూపాక మొగిలికి రెండేళ్ల జైలుశిక్ష, 2023లో వీఆర్వోలు మధుసూదన్ రావు, రాంచందర్ రావు, వెంకట రమణ, శ్రీనివాస్‌కు నాలుగేళ్ల పాటు జైలు శిక్ష, రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధిస్తూ తీర్పులు వెలువడ్డాయి.

## నిధులు చాలక..
# నిర్మాణాలు సాగక

**గంభీరావుపేట-నవభూమి:** ఆట పాటలతో సాగే అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.నిధులు చాలక ఏళ్ల తరబడి నిర్మాణం మధ్యలో ఆగిపోయాయి. దీంతో అద్దె భవనాలు, పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లబ్ధిదారులు అవస్థలు పడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.జిల్లాలో సిరిసిల్ల, వేములవాడలో రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు 587 ఉన్నాయి. ఇందులో 51 అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. రెండింటికి మిగులు పనులకు నిధులు మంజూరు కాగా పనులు చేస్తున్నారు. ఇంకా 49 భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కొన్ని భవనాలు స్లాబ్ దశలో, మరికొన్ని ప్లాస్టరింగ్, బెడ్, విద్యుత్తు పనులు చేయాల్సి ఉంది. కొన్ని కేంద్రాలకు ఒకసారి నిధులు మంజూరు కాగా, కొన్నింటికి రెండు సార్లు విడుదల చేసినా చాలక మధ్యలో ఆగిపోయాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరు చేసి భవనాల పూర్తికి చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.ఇవీ ఇబ్బందులు అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో నిర్వహిస్తుండటంతో పూర్తి స్థాయిలో వసతులు లేక చిన్నారులు అవస్థలు పడుతున్నారు.సరైన వెలుతురు లేకపోవటం, గదులు చిన్నవిగా ఉండటంతో చిన్నారులు ఆడుకోవడానికి వీల్లేకుండా ఉంది.కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులకు అనుకూలంగా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.అద్దె భవనాల్లో మూత్రశాలలు లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.ఈ చిత్రంలో కనిపిస్తున్న గంభీరావుపేట మండలంలోని నర్మాల క్యాంపులోని అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి 2015 సంవత్సరంలో రూ.4 లక్షలు మంజూరయ్యాయి. 2018లో మరో రూ.3 లక్షలు విడుదల చేశారు. వీటితో 80 శాతం పనులు పూర్తయ్యాయి. తలుపులు, కిటికీలు,





విద్యుత్తు తదితర పనులు మిగిలిపోయాయి. ప్రస్తుతం ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం రెండు పడక గదుల ఇంట్లో నిర్వహిస్తున్నారు.త్వరగా పూర్తి చేయాలి మండలంలోని ముస్తఫనగర్‌లో పక్కా భవనం నిర్మాణంలో ఆగిపోయింది. కేవలం స్లాబ్ వరకు మాత్రమే పనులు చేశారు. దాదాపు పది సంవత్సరాలు అవుతుంది. అద్దె భవనంలో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పూర్తి చేసి సమస్యలను తీర్చాలి.బండ కస్తూరి, అంగన్‌వాడీ చిన్నారి తల్లి, ముస్తఫనగర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం జిల్లాలో 51 భవనాలు నిర్మాణం మధ్యలో ఆగిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కేవలం రెండు భవనాలకు నిధులు మంజూరు చేశారు. వాటి పనులు కొనసాగుతున్నాయి. దశల వారీగా నిధులు మంజూరు చేసి, అసంపూర్తిగా ఉన్న వాటిని కూడా పూర్తి చేస్తాం.

# కర్రలు పట్టుకొని విధులకు

**యైటింక్లయిన్‌కాలనీ, -నవభూమి:** వీధికుక్కల దాడులతో సింగరేణి సిబ్బంది భయ భ్రాంతులకు గురవుతున్నారు.వారం రోజుల వ్యవధిలో ఆర్జీ-2 డివిజన్‌లోని వర్క్‌షాప్ వద్ద ఓ కాపలాదారుడిని, మరో ఇద్దరు జనరల్ మజ్దూర్ కార్మికులపై దాడిచేశాయి. పోతనకాలనీ ప్రధాన చౌరస్తాలో ఓ కార్మికుడు, మహిళపై విరుచుకుపడ్డాయి. భాస్కర్‌రావునగర్ వద్ద సైకిల్‌పై వెళుతున్న ఓ వృద్ధుడిని వెంబడించి కరవడంతో.. భయంతో సైకిల్‌ను అక్కడే వదిలేసి పరుగులు తీశాడు.భయం భయంగా..రాత్రి వేళలో వీధి కుక్కల బెడద మరింత ఎక్కువవుతోంది. గోదావరిఖని, పోతన కాలనీ, ఓసీపీ-3, వకీలుపల్లె, వర్క్‌షాప్, అడ్రియాల ప్రాజెక్టు విధులకు వెళ్లి, వచ్చేవారు శునకాలకు భయపడాల్సి వస్తోంది. ద్విచక్రవాహనాలపై వెళ్తున్న కార్మికులను వెంబడిస్తుండడంతో.. భయంతో వేగం పెంచుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితమే ఓ కాపలాదారి విధులకు వెళ్తుండగా దాడిచేయడంతో.. అతని కుడికాలుకు గాయమైంది. దీంతో రాత్రివేళలో కార్మికులు తమ వెంట కర్రలను తెచ్చుకుంటున్నారంటే వీధి కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది.అమలుకు నోచని సీఎం ఆదేశం 'ఈ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. వీధికుక్కల బెడద ఉన్న ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడానికి కాల్ సెంటర్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయండి. వీధి కుక్కలు ఇలా దాడులకు పాల్పడడానికి కారణాలపై అధ్యయనం చేయడానికి పశు వైద్యులు, బ్లూక్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిపుణుల కమిటీ వేయండి. శునకాల నియంత్రణకు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించండి. తక్షణ చికిత్స అందించడానికి ఆసుపత్రుల్లో మందులను అందుబాటులో ఉంచాలి' అని ఇటీవల హైదరబాద్‌లో చిన్నారి మృతిచెందిన ఘటనను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. నేటికీ చర్యలు తీసుకోవడం లేదు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండున్నర లక్షలకు పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో.. వీధి కుక్కలకు జనం భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.మందులు సిద్ధంగా ఉన్నాయి సెక్టార్-3 డిస్పెన్సరీలో కుక్కకాటు మందులు సిద్ధంగా ఉన్నాయి. మూడు రోజుల క్రితం విధి నిర్వహణలో ఉన్న కార్మికుడిపై శునకాలు దాడిచేస్తే చికిత్స చేశాం.

